క్లుప్తంగా

భూనీడ్‌లో ప్రీస్కూల్ వార్షికోత్సవం



మద్దూరు: కొత్తపల్లి మండలంలోని భూనీడ్ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ప్రీస్కూల్ చిన్నారులు, వారి తల్లులు, గర్భిణులు, బాలింతలతో కలిసి వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. గ్రామ పరిధిలోని అంగన్‌వాడీలన్నీ కలిసి వీరికి అందించాల్సిన పౌష్టికాహారంపై అవగాహనతోపాటు వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు రాజమ్మ, లక్ష్మీదేవి, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పదవుల ఆశజూపడం సరికాదు..

నారాయణపేట: పేట సభలో మాదిగలపైన ఎంతో ప్రేమ ఉన్నట్టుగా సీఎం రేవంత్ నటించడం మాదిగలను మోసం చేయడమేనని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు డీకే నరసింహ మాదిగ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణపేట సభలో సీఎం మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కట్టుబడి ఉన్నామని, మాదిగలకు నామినేటెడ్ పదవులు ఇస్తామని అనడం హాస్యాస్పదమన్నారు. మాదిగలను మభ్య పెట్టేందుకు కాంగ్రెస్ మరోసారి కంకణం కట్టుకున్నదని అది గమనించిన మాదిగలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెబుతారన్నారు.

పశుగ్రాసం కొరత



మరికల్: ఎండలు తాకిడికి వ్యవసాయ బోర్లలో భూ గర్భజలాలు అడుగంటిపోవడంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. దీంతో వరిపంటలకు నీళ్లు అందక నిలువున పంటలు ఎండిపోవడంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో పశువులకు పశుగ్రాసం దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. పశుగ్రాసం కొరత ఏర్పడటంతో ఎకరాకు రూ. 1500 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కరువు పరిస్థితుల కారణంగా ఈ ఏడాది దారుణ పరిస్థితులు నెలకొనడంతో రైతులు పశువుల మేత కోసం పొలాల వెంబడి తిరుగుతు కోతలు వేసిన పంటల పశుగ్రాసాన్ని కొనుగోలుచేసి పశువులను కాపాడుకుంటున్నారు.

వైభవంగా జల్దిబిందె



మాగనూర్: మండల పరిధిలోని కొత్తపల్లిలో శ్రీ ఆంజనేయస్వామివారి జల్దిబిందే కార్యక్రమాన్ని మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రం నుంచి గ్రామస్తులు కృష్ణా మండలంలోని నదికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నది నుంచి తీసుకొచ్చిన నదిజలాలతో ఆలయంలో పూజలు చేసి స్వామివారికి అభిషేకం చేశారు. బుధవారం నుంచి శ్రీ రామ నవమిని పురస్కరించుకుని మూడురోజుల పాటు జాతర ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మాగనూర్: మండల కేంద్రంలోని అభిషేక్ దాబా వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మక్తల్ వైపు నుంచి రాయచూర్‌కు వెళ్తున్న కారు, నల్లగట్టు నుంచి మక్తల్‌వైపు వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో వ్యక్తికి గాయాలైయ్యాయి. దీంతో స్థానిక పోలీసులు సాయంతో గాయపడిన వారిని స్థానిక ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంలో గాయపడిన అళిమళి శరణప్ప సోదరుడు రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపారు.

18నుంచి బ్రహ్మోత్సవాలు

కృష్ణా: మండల పరిధిలోని చేగుంటలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవాలు ఈ నెల 18నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ అధిపతి శ్రీ క్షీరలింగమహాస్వామి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 18న స్వామివారి పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. 19న విగ్రహాల అలంకరణ, రుద్రాభిషేకం, బిల్వార్చన, పల్లకిసేవ, నందికోలు ఉత్సవంతోపాటూ సాయంత్ర ప్రభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20న స్వామివారి రథోత్సవం, అదేరోజు రాత్రి భక్తి ప్రవచనాలు, భజనమండలి చేత భజనగీతాలు, 21న సందెపురాళ్లు ఎత్తడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు హాజరై తమ మొక్కులను తీర్చుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చర్చలు, తీర్మానాలు లేకుండానే..



సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య

మాగనూర్: మండల సాధరణ సర్వసభ్య సమావేశం మంగళవారం ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభ సాదాసీదాగా కొనసాగింది. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎటువంటి నూతన పనులకు సంబంధించిన చర్చలు, తీర్మానాలు చేయ లేదు. దీంతో సభలో కేవలం ప్రగతి నివేదిక మాత్రమే సభ్యులు చదివి వినిపించారు. అయితే కొన్ని జరిగిన పనులపై ఎంపీపీ శ్యామలమ్మ, వైస్ ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్ ఆయాశాఖల అధికారులను ప్రశ్నించారు. మండలంలో ఉపాధిహామీ పనులో అవకతవకలు జరుగుతున్నాయని ఎంపీపీ సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో ఉపాధిహామీ పనులు పూర్తిస్థాయిలో జరడగం లేదన్నారు. ఉపాధి పనులు జరుగుతున్న కూలీలకు సకాలంలో డబ్బులు రావడం లేదని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కూలీలకు డబ్బులు సకాలంలో వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మ ఆదర్శ కమిటీలు పాఠశాలలో కొనసాగుతున్నాయని, వేసవి సెలవులు ముగిసే సరికి ప్రతి పాఠశాలలో మౌళిక వసతులు కల్పిస్తామని ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. మండలంలో ఇంకా పలు గ్రామాలకు రేషన్ షాపులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని సమస్యలు పరిష్కరించాలని వైస్ ఎంపీపీ తిపయ్య కోరారు. సమస్య పరిష్కారంకోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఉప తహసీల్దార్ సురేష్ వివరించారు. అందుబాటులో ఇసుక ఉన్న గ్రామాల్లో ఇసుక సరఫరా లేక ఇళ్ల నిర్మాణాలు నిలిపోయాయని, ప్రభుత్వం ఉచిత ఇసుక అమలు చేస్తునందున అర్హులకు ఉచిత ఇసుక సరఫరా చేయాలని వడ్వాట్ ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్ రెవెన్యూ అధికారులను కోరారు. తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని, కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తమన్ని డీటీ సురేష్ తెలిపారు. అయితే సర్వసభ్య సమావేశంకు ప్రధాన శాఖల అధికారులతో పాటు కొందరు ప్రజాప్రతినిధులు సైతం డుమ్మ కొట్టారు. మరోవైపు సభ సాగుతుంటే కొందరు పంచాయతీ కార్యదర్శులు మాత్రం తమకు ఎమి పట్టన్నట్టుగా సొంత పనులో నిమగ్నమయ్యారు. కొందరి అధికారులు మాత్రం చర్చలు విన్నకుండా ఫోన్లతో కాలక్షేపం చేయడం ఆశ్చర్యానికి గురిచేసిందని పలువురు సభ్యులు ఆరోపించారు. అయితే వేసవి కాలం తాగునీటి కోసం గ్రామాలలో ప్రజలు తంటాలు పడుతుంటే ఆశాఖ అధికారి మాత్రం సమావేశానికి రాలేదు. వేసవిని దృష్టిలో ఉంచుకున్ని గ్రామాలలో తాగునీటిని అందించేందుకు పనులు ముమ్మరంగా కొనసాగిస్తున్నామని ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి సభదృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామలమ్మ, జెడ్పీటీసీ వెంకటయ్య, వైస్‌ఎంపీపీ దూళ్ల తిప్పయ్య, ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యర్శులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం..



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానయ్య

కృష్ణా: ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండగా తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ఎంపీడీఓ జానయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కున్సి, ఖాన్‌దొడ్డి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు, వాటి పైప్‌లైన్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎక్కడా ఏ ఇబ్బందులు ఉన్నా తాము తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు. వీరితోపాటు పంచాయతీ కార్యదర్శులతో పాటూ మిషన్ భగీరథ అధికారులు ఉన్నారు.

పూలే విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో మహాత్మ జ్యోతి బాపూలే నూతన విగ్రహా ఏర్పాటు కోసం పంచాయతీ నుంచి స్థలం కేటాయించాలని కోరుతూ నూతన విగ్రహా కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత కొన్ని రోజులుగా గ్రామంలో నూతన విగ్రహా ఏర్పాటు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని, కానీ సరైన స్థలం లేక పనులు ముందుకెళ్లడం లేదని తెలిపారు. ప్రధాన కూడలీలో పూలే విగ్రహ ఏర్పాటు చేసుకునేందుకు గ్రామ ప్రజల ద్వారా సంతకాలు సేకరించామన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కేవీ నర్సింహ, వెంకటప్ప, రాజు, చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు



ముస్తాబైన రామాలయం

కోస్గి: శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం నిర్వహించనున్న సీతారాముల వివాహా మహోత్సవానికి పట్టణంలోని ఆలయం ముస్తాబైంది. ఆలయ కమిటీ సభ్యులు ఆలయానికి రంగులు వేయించి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం మధ్యాహ్నం 11:35 గంటలకు అభిజిత్ లగ్నంలో సీతారాములకు వివాహం చేయనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధి చల్ల శ్రీరాములు తెలిపారు. ఈ సందర్భంగా వివాహ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సాయంత్రం పల్లకీ సేవ కార్యక్రమం ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక



కమిటీ ఎన్నికల్లో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఊట్కూరు: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం కమిటీని ఎన్నుకున్నట్లు హెచ్ఎం సురేష్ తెలిపారు. చైర్‌పర్సన్‌గా వెంకటమ్మ, సభ్యులుగా కొక్కులక్ష్మి, చాకలి పద్మ, వై. లక్ష్మి, సావిత్రమ్మ, మణెమ్మ, పద్మ, యాస్మిన్‌బేగం, జరీనాబేగం, జహిదాబేగం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రహమాన్, వెంకటరాములు, అశోక్, పజల్‌అహ్మద్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



నారాయణపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: వికసిత భారతే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని బీజేపీ నాయకులు రఘువీర్ యాదవ్, లక్ష్మి, నందునామాజీ, కృష్ణ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డులో ఇంటింటికి తిరిగి బీజేపీ మ్యానిఫెస్టోను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోదీతోనే దేశ రక్షణ సాధ్యమవుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో వెంకటయ్య, దత్తు, రాము, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: పాలమూరు జిల్లా బీజేపీ అభ్యర్థి డీకే అరుణను ఎంపీగా గెలిపించాలని కోరుతూ మంగళవారం పోతిరెడ్డిపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామంలోని ఆయా కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సీబీ వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, గ్రామ అధ్యక్షుడు దేవప్ప, పట్టణ ప్రధాన కార్యదర్శి బెజ్జు జైపాల్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు మంగలి భాస్కర్, నాయకులు బెజ్జు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మవ్వను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మాగనూర్: మండలంలోని బైరంపల్లిలో మంగళవారం మారెమ్మ జాతర సందర్భంగా మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని మక్తల్ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆ తల్లిని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంజుల, నేరడగం ఎంపీటీసీ ఎల్లారెడ్డి, నాయకులు రాజుల ఆశిరెడ్డి, పురోషత్తంగౌడ్, రాఘవేంద్ర, అంజప్ప పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని అమీన్‌పూర్ మాజీ ఎంపీటీసీ అనసూయమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమ్మోహన్‌రెడ్డి మృతురాలికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, చిన్నసాయిలుగౌడ్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాల తనిఖీ



మాగనూర్: మండల పరిధిలోని గురువ లింగంపల్లి ప్రాథమిక పాఠశాలను మండల ఇన్‌చార్జి ఎంఈఓ వెంకటయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి రావడానికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన భోజనంతోపాటు వారానికి మూడు సార్లు గుడ్లు పెట్టాలని తెలిపారు. రికార్డులను పరిశీలించి సక్రమంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బాల్‌రాం, సీఆర్పీ ఎల్లాగౌడ్, వివి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బీరప్ప ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్లలో మంగళవారం బీరప్ప ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. స్వామివారికి బండారు కార్యక్రమం చేపట్టారు. ఈ వేడుకలలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్‌కుమార్, ఈశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కేశవరెడ్డి



మద్దూరు: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా కొత్తపల్లి మండలంలోని నందిగామకు చెందిన కేశవరెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రకటించారు. ఈ మేరకు.. మంగళవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావునామాజీ శాలువాతో సన్మానించారు. అలాగే బీజేపీ చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ అరుణమ్మ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మదన్, వెంకటయ్య నీలిరవి, జ్ఞానేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

మాగనూర్: విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృత్యువాత పడిన ఘటన మంగళవారం మండలంలోని మందిపల్లిలో చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ శివారులో మేతమేస్తుండగా విద్యుత్‌వైర్లు తెగి కిందపడి ఉన్న వైర్లను తగిలి మూడుగేదెలు అక్కడిక్కడే మృతిచెందినట్లు తెలిపారు. గేదె విలువ దాదాపు రూ. 2లక్ష వరకు ఉంటుందని, తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

ఊట్కూరు: మండలంలోని ఎడివెల్లిలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం నుంచి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, మధ్యాహ్నం కల్యాణం, సాయంత్రం వేంకటేశ్వరస్వామి రథోత్సవం, గురువారం పాల ఉట్లు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు.



గ్రామాల్లో తక్షణ అవసరాలు తీర్చాలి



సభలో మాట్లాడుతున్న ఎంఈఓ గోపాల్‌నాయక్, ఏఈ విలోక్

మద్దూరు: వేసవిని దృష్టిలో ఉంచుకొని మండలంలోని ఆయా గ్రామాల్లో తక్షణ అవసరాలైన తాగునీటి, విద్యుత్, వైద్యం తదితర పనులను వెంటనే చేపట్టాలని ఎంపీటీసీలు అధికారులకు సూచించారు. మంగళవారం ఎంపీపీ విజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. వివిధ శాఖలపై అధికారుల తమ ప్రగతి నివేదికను చదవి వినిపించారు. ముందుగా వ్యవసాయ శాఖపై ఏఈఓ శ్రవణ్‌కుమార్ ప్రగతి నివేదిక చదివారు, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను మండలంలోని కొన్నిచోట్ల ఏర్పాటు చేశామని, రైతులకు తేమశాతాన్ని బట్టీ ఏ గ్రేడ్ క్వింటాళ్లకు రూ. 2,203, బీ గ్రేడ్ రూ.2,183 అందజేస్తున్నామని తెలిపారు. గన్‌వాడీలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న లిస్టు ఇస్తే వారికి పక్క భవనాలు మంజూరు చేయిస్తామని పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ తెలియజేశారు. వేసవిలో వడదెబ్బ తగలితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వైద్యాధికారిణి శ్రీలత వివరించారు. నేటికి కేసీఆర్ కిట్ అని ప్రగతి నివేదికలో సూచించడంతో గతంలో ఉన్న ప్రగతి నివేదికలనే ఇప్పుడు చదువుతున్నారని ఎంపీపీ ప్రశ్నించారు. మోమినాపూర్, చెన్నారెడ్డిపల్లి, పెదిరిపాడ్ గ్రామాల గుట్టల్లో పులి సంచారం ఉందని మేకలు, కుక్కలను, లేగదూడలను చంపుతుందని బోను పెట్టాలని సూచించిన స్పందించడం లేదని అటవీశాఖ బీట్ అధికారి లక్ష్మణ్‌ను కోరారు. దీనిపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధిహామీ పథకంలో పశువుల షెడ్లకు రైతుల నిర్మాణం చేసుకోవాలంటే తప్పనిసరిగా ఫాపాండ్ ఏర్పాటు చేసుకోవాలనే నిబంధన ఎమిటని పీఏసీఎస్ చైర్మన్, ఎంపీటీసీ వెంకటయ్య ఉపాధి ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. షెడ్డు నిర్మాణం చేపట్టి రెండేళ్లు గడుస్తున్న డబ్బులు రాలేదన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా బడులకు మౌళిక వసతుల కల్పన పనులు చేపట్టనున్నట్లు ఎంఈఓ గోపాల్‌నాయక్, పీఆర్ఏ విలోక్ తెలియజేశారు. వీటికోసం కమిటీల బ్యాంకు ఖాతాలు తెరిచామని అందులో రూ. 25వేల జమచేయడం జరిగిందని పేర్కొన్నారు. అయిల్ ఫాం తోటలపై ఉద్యానవన అధికారి స్వప్న వివరించారు. తోటల్లో పండిన గింజనలు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని వివరించారు. తాగునీటి సరఫరాకు ఏలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నయ్యను సభ్యులు సూచించారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు చేయాలని తహసీల్దార్ మహేష్ దృష్టికి సభ్యులు తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రజా పాలన దరఖాస్తుల పనుల జరుగడం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కొత్తపల్లి తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీఓ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

కృష్ణా: ప్రజలు తమ ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని ఎస్‌ఐ ఎండీ నవీద్ అన్నారు. మంగళవారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన చేగుంట, ఐనాపూర్ గ్రామాల్లో సాయంత్రం కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏస్పీ యోగేష్‌గౌతమ్ ఆదేశాల మేరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులతోపాటు కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి



కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధిహామీలో పనిచేస్తున్న కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా నాయకులు వెంకట్రాములు, నారాయణ డిమాండ్ చేశారు. మండలంలోని తిర్మలాపూర్, గనిమోనిబండ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. జాబ్‌కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికి 200రోజులు పని కల్పించాలని, రోజువారి కూలీని రూ.600కి పెంచాలని డిమాండ్ చేశారు. వేసవిలో ఎండలు మండిపోతున్న కనీససౌకర్యాలు కల్పించలేదని, నీడకోసం టెంట్లు, తాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, కనకప్ప, సత్యమ్మ, దస్తమ్మ, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం



నారాయణపేటలో చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు


నారాయణపేట రూరల్: ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ సత్యనారాయణ చౌరస్తాలో సీఎం రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సరాఫ్‌నాగరాజు మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి ఏకి మార్చడం కోసం సీఎం హామీ ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. అందుకు కృషి చేస్తున్న ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డితో పాటు వంశీచందర్‌రెడ్డి, కుంభం శివకుమార్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంత్‌కుమార్, హన్మంతు, సునీల్, జనార్ధన్, మారుతి, రంజిత్, రాజు, ఆనంద్, వెంకటేష్, అంజి, కనకప్ప, శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

సీఎం హామీలపై ముదిరాజ్‌ల హర్షం

దామరగిద్ద: ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏ గ్రూప్‌లో మార్చేందుకు చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ హామీ ఇవ్వడంపై మండల ముదిరాజ్ నాయకులు విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మొగులప్ప, హన్మంతు, వెంకటప్ప తదితరులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జనజాతర సభలో మాట్లాడిన సీఎం ముదిరాజ్ అభ్యున్నతికి కృషిచేస్తానని హామీ ఇవ్వడంపై హర్షణీయమన్నారు.

మక్తల్: ముదిరాజులను బీసీ డీ నుంచి ఏకి మార్చడం కోసం సీఎం హామీ ఇవ్వడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు.. పట్టణంలోని సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్‌కుమార్, నాయకులు హన్మంతు, సునీల్, జనార్ధన్, రాజు, అంజి, ఆనంద్, వెంకటేష్, కనకప్ప, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జల సంరక్షణ.. మనందరి బాధ్యత



జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

కోస్గి: 'జల సంరక్షణ.. మనందరి బాధ్యత' అంటూ విద్యార్థులు జల ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు మంగళవారం వాక్‌ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జల సంరక్షణపై పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. మండల పరిధిలోని కడంపల్లి ప్రాథమికొన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాక్‌ఫర్ వాటర్ స్వచ్ఛంద సంస్థ వలంటీర్ వీరు మల్లేష్ ఆయా పాఠశాలలో నీటిని వృథా చేయకుండా అవసరమైనంత వరకు వినియోగించుకుంటూ జల సంరక్షణలో భాగస్వాములవుదామని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే జల సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు పద్మావతి, ఉమాలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు దీక్షతో కాంగ్రెస్‌లో వణుకు



మాట్లాడుతున్న రవికుమార్

ధన్వాడ: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన రైతు దీక్షతో కాంగ్రెస్ ప్రభుత్వంలో వణుకు పుట్టిందని ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పార్లమెంట్ సమన్వయకర్త రవికుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా రైతుల పక్షాన బీజేపీ చేస్తున్న పోరాట ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వంలో చలనం మొదలైందని, అందుకే నారాయణపేటలో జరిగిన సభలో రుణమాఫీ చేస్తామని ప్రకటించారన్నారు. రైతులకు ఏక కాలంలో ఆగస్టు 15 వరకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని ప్రకటన చేయడమంటే రైతుల విజయం బీజేపీ పోరాట ఫలితమే అన్నారు. అలాగే రాష్ట్రంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో డీకే అరుణకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డె శ్రీరామ్, కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జట్రం గోవర్ధన్‌గౌడ్, నాయకులు రామచంద్రయ్య, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.